# మాను వంగింది

"అమ్మా! నాన్నగారు నిన్ను కొంచెం త్వరగా రమ్మన్నారమ్మా, ఏమీ తోచడం లేదట. మూడు గంటలకే స్కూల్లో పర్మిషన్ పెట్టి వెళ్ళిపోవూ?" అన్నది వసుమతి తల్లితో.

"అల్లాగే వెడతానుగానీ, నువ్వు కారియర్‌లో అన్నీ సరిగ్గా సర్దుకున్నావా? నాన్నగారు నిదానంగా తింటారమ్మా అన్నం. నువ్వు తొందర పెట్టకు. తమ్ముడు ప్రొద్దున డాక్టర్ రమేశం గారితో మాట్లాడాడేమో అడుగు. ఎప్పుడు నాన్నగారిని డిస్చార్జి చేస్తానన్నారో ఏమిటో!" అని చాలా హడావిడిగా మాట్లాడుతూ, వూడిపోతున్న సిగలో సూదులు గ్రుచ్చుకుంది సూర్యకాంతమ్మ. పంతులమ్మాటేనే లెక్కలేనన్ని పుస్తకాలు, పేపర్లు, రికార్డులు, అవన్నీ సద్దుకుని, హాస్పిటలులో వున్న భర్తకి పథ్యంవంట చేసి తెమిలేసరికి రోజూ స్కూలుకి లేటుగా వెళ్ళడమే. చీరె వెనుకవేపు మడమపైన జానెడుపైకి పోతుంటుంది. ఊడిపోయిన చెప్పు కుట్టించుకోవటానికి వారంరోజులైనా ముహూర్తం కుదరక అల్లాగే యీడ్చుకుంటూ వెడుతుంది.

ఆమె భర్త అప్పర్ డివిజను గుమాస్తా. సాంబశివరావుకి రెండేళ్ళనుంచీ కడుపులోనెప్పి వస్తోంది. నాకు రోగం ఏమిటీ అంటూ మొండివాళ్ళు అందరిలాగే అతనూ వైద్యం చేయించుకోకుండా కాలం జరుపుతూ వచ్చాడు. ఆ నొప్పికొంప ముంచే స్థితికి వచ్చింది ఒకనాడు. వెంటనే ఆపరేషను జరిపించాలన్నారు. ఆస్పత్రిలో చేర్చారు. ఆపరేషనుచేసే డాక్టరుకి ముందుగా రెండు వందలూ, పూర్తిగా నయమై యిల్లు చేరాక మరో వందరూపాయలూ యివ్వడానికి బేరం కుదిరింది.

ఈవేళో రేపో డిస్చార్జ్ చేస్తారన్న వార్త తెలిస్తే హాస్పిటల్‌లో సకల సపర్యలు చేస్తున్న వారందరికీ కట్నాలు, కానుకలూయిచ్చుకుంటూ బయట పడాలి. ఇంకెన్ని మందులు కొనాలో, ఎన్ని పత్యాలు చేయాలో.

నిట్టూరుస్తూ ఆలోచించడానికీ, దిగులుపడడానికీ కూడా టైము దొరకదు పంతులమ్మ సూర్యకాంతమ్మకి ఇరవైఆరేళ్ళ సర్వీసు తర్వాత ఇన్నాళ్ళకి ఫస్టు అసిస్టెంటు అయింది ఎనిమిది వందల మంది ఆడపిల్లలున్న ఆ బళ్ళో.

అసలీమధ్య హాస్పిటల్ చుట్టూ తిరగడంతో, స్కూలుకి సరిగ్గా వెళ్ళక, చాలరోజులు మానేసిందామె. ఇంక ఈ వేళ పర్మిషన్ అడగాలంటే మనస్సు వప్పడం లేదు. కానీ ఆయన ఒక్కయా హాస్పిటల్లో, ఎంత విసిగివున్నారో! వసుమతి బి. ఎస్. సి ప్యాసై ఆరు నెలలు కాలేదింకా.

కాలేజీ స్టూడెంటు చురుకుపాలు పోలేదింకా. హాస్పిటల్ మగ వాళ్ళ వార్డులో ఎంతసేపుంటుంది, ఏం జేస్తుంది. బాబ్జీ పదో క్లాసు తప్పాడు. వాడు ప్రయోజకుడూ కాడు. అల్లాగని తల్లి మాట జవదాటని బుద్ధిమంతుడూ కాడు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత పుట్టాడు కనుక గారాబం జరిగిందని, అందుకు నువ్వే కారణం అంటే, నువ్వే కారణం అని భార్య, భర్త వాదించుకుంటూంటారు.

తెల్లవారడం, బారెడు ప్రొద్దెక్కడం, పరుగులెత్తడం, ఏవో సాధ్వనులతో రోజంతా గడపడం, సూర్యుడు అస్తమించడం, అంతలోనే రాత్రి కావడం, నిద్ర ముంచుకు రావడం—ఇవన్నీ ఎంతవేగంగా జరుగుతున్నాయో గుర్తించే స్థితిలో వుండదు సూర్యకాంతమ్మ సాధారణంగా. ఇక సాంబ శివరావు దీర్ఘవ్యాధి, పైకి పోకుండా ఆగిన వసుమతి చదువు కుదరకుండా తప్పిపోతున్న సంబంధాలు పెళ్ళి అయినా ఏవో వస్తువాహనాల పేచీలతో నిప్పుల పొయ్యిలా తయారైన పెద్ద దాని కాపురం—వీటిల్లో దేన్ని గురించి బాధ పడాలి సూర్యకాంతమ్మ.

గేటులోకి పరుగెతుతోంటే బెల్లు అయింది. ఇంకేముంది.

ఇంతకు మునుపు వారం రోజులనాడు ఒకసారి స్కూల్లో ఏం జరిగిందంటే—

"మీరంతా కలిసి యిందాక యింటర్వెల్‌లో ఎక్కడికి వెళ్ళారు?" జవాబు లేదు. "ఎక్కడికి వెళ్ళారు చెప్పరేం?" రెట్టించింది సూర్యకాంతమ్మ.

ఏడో క్లాసు చదివే అయిదుగురు అమ్మాయిలూ బిక్కముఖాలతో ఒకరి నొకరు చూసుకొన్నారు.

"చెప్పండి—వెంటనే!" అని గర్జించింది ఆమె.

"హోటల్‌కి" అని సన్నగా చెప్పింది గోలక్ష్మి అనే ఒక అమ్మాయి.

"ఎంతైంది బిల్లు? ఎవరిచ్చారు?"

భయంగా నీరజవైపు చూచారు పిల్లలు. కాబట్టి నీరజే బాధ్యురాలని తేలిపోయింది. నాల్గురోజులున్నించి యీ పిల్లల జట్టు హోటల్‌కి పోయి వస్తున్నారు విడవకుండా. ధయిర్యంగా పాన్ నములుతూ యీ వేళ గేటులోకి వస్తోంటే, సూర్య కాంతమ్మ చూసింది. ఇదివరకే ఎవరో చూచాయగా చెప్పారు. మీ బడి పిల్లలు ఆహోటల్‌కి అతిగా వెడుతున్నా రని.

"ఎంతైది బిల్లు నీరజా? ఎక్కడిది నీకు డబ్బు? అందరికీ నువ్వే యిచ్చావా? ఎందుకిచ్చావు?" అంటూ సూర్య కాంతమ్మ టీచర్ గద్దిస్తోంటే నీరజ "నాదే" అన్నది మెల్లిగా.

"నీకు ఎక్కడిది?"

"మా నాన్నగారిచ్చారు." అన్నది.

"మీ యింట్లో ఫోనుందిగా, మీ నాన్నగారిని అడగనా యిచ్చారో లేదో!" అనగానే, తలెత్తి టీచరువంక చూసింది నీరజ. నిజంగా అడుగుతారా, దయచేసి అడక్కండి అనే అభ్యర్థన ఆ కళ్ళల్లో.

"నీ దగ్గర ఎంత డబ్బుంది!" అని సూర్యకాంతమ్మ మళ్ళా అడగగానే నోటుబుక్కు తీసి, మెల్లిగా, ఆరు పది రూపాయల నోట్లు యిచ్చింది నీరజ.

"అరవై రూపాయలా! ఇంక తినేసింది ఎంత మీరు!" సూర్యకాంతమ్మ కంఠానికి, బెదిరింపులకీ నీరజ వణికి, వణికి చివరికి ఏడుపు మొదలుపెట్టింది. నాన్నగారు వూరు వెడుతూ అలమారు తాళంచెవి మర్చిపోయారు టీచర్! నేను డబ్బు తీశాను ప్లీజ్. చెప్పకండి టీచర్!" అంటూ గొడవగా ఏడుపు మొదలు పెట్టింది. సూర్యకాంతమ్మగారు ఎంత స్ట్రిక్టో అందరికీ తెలుసు. ఆమె దగ్గర డొంకతిరుగుడు మాటలు లాభం లేదనీ తెలుసు.

"మీ నాన్నగారికి చెప్పక తప్పదు. నీ తప్పుకు శిక్ష తప్పదు." అన్నది సూర్యకాంతమ్మ నిశ్చలంగా.

"వద్దు టీచర్! మా నాన్న నన్ను చంపేస్తారు టీచర్! చెప్పకండి. ఈ డబ్బు పూర్ ఫండ్‌లో వేసేయండి." అన్నది నీరజ గబ గబ కళ్ళు తుడిచేసుకుంటూ.

సూర్యకాంతమ్మ హేళనగా నవ్వి, "పూర్ ఫండ్‌కి యిస్తానని నాకు లంచమా! నువ్వు దొంగతనం చేసి తెచ్చిన

డబ్బు ఆ ఫండ్‌లో వేస్తే అదికూడా మలినం అయి పోతుంది.'' అన్నదామె. బాణాల్లాగా ఆమె విసిరే యీ మాటలకి నీరజ గిలగిల లాడిన పక్షి అయిపోయింది. కానీ ఉక్రోషం వచ్చినట్లు చూసింది టీచరువంక.

"మా డబ్బేకదా టీచర్? అది దొంగతనం క్రింద ఎల్లా గవుతుందండీ!'' అన్నది.

సూర్యకాంతమ్మ ఆమెవంక తేరిపార చూస్తూ, "మీ డబ్బే అయితే, అది దొంగతనం కాకపోతే. నీకెందుకు భయం. మీ నాన్నగారితో చెబుతానంటే! నీరజా నా దగ్గర నీ తెలివి ప్రదర్శించాలనా!'' అన్నది కటువుగా.

ఆ తర్వాత ఆ పిల్ల తండ్రికి చెప్పడం, ఆయన వచ్చి హెడ్ మిస్ట్రెస్ దగ్గర ఆ పిల్ల ప్రవర్తనను గురించి వాపోవడం అన్నీ జరిగాయి. ఆ తరువాత ఒకనాడు మరో దొంగతనం. మాలతి అనే పేదపిల్ల తనకీ, తన చెల్లెళ్ళకీ పుస్తకాలు కొనుక్కోవడం కోసం తెచ్చిన ముప్ఫై రూపాయలు మొదటి పీరియడ్‌లోనే మాయమైపాయి. ఆ తరువాత రెండో పీరియడ్‌లోనే దొంగను పట్టారు. మరో పిల్ల బాక్సులో దొరికాయవి. ఆ అమ్మాయికి పన్నెండేళ్ళు ఉంటాయేమో సన్నగా వుంది, వెలిసిపోయిన యూనిఫాం డ్రెస్సు.

"డబ్బు ఎందుకు తీశావు!'' జవాబు లేదు.

"ఎందుకు తీశావు!'' కసిగా, రోషంగా ఒక చూపు.

"ఎందుకు తీశావు డబ్బూ! ఏం చేద్దామని! పోలీసులకి పట్టిస్తా. జవాబు చెప్పూ'' సూర్యకాంతమ్మ కంఠం తారా

స్థాయి నందుకుంది. బెదరిన చూపు, బోనులో చిక్కుకున్న జంతువులా, వలలో పడిన పక్షిలా విలవిల లాడిన చూపు ఆ అమ్మాయిది.

"క్రిందటి నెలలో క్రొత్త నోటు బుక్కులు పట్టుకెళ్ళి రోడ్డుచివర దుకాణంలో అమ్ముతుంటే నిన్నేకదా పట్టుకున్నారు. చాక్లెట్లకోసం, మొక్కజొన్న కండెలకోసం రెండేసి రూపాయల నోటుబుక్కులు అమ్మేస్తావా! ఇప్పుడు ఏకంగా యిన్ని రూపాయలు దొంగిలిస్తావా!" అంటూ మాటలు యీటెలతో పొడుస్తోంది సూర్యకాంతమ్మ. తప్పదు మొక్కయి వంగనిదే మానై వంగుతుందా మరి!

"రేప్రొద్దున్న ఎసెంబ్లీలో అందరి ఎదురుగా ఆ పిల్లకి క్షమాపణ చెప్పాలి నువ్వు అంత అవమానం జరిగితే గానీ కాస్త బుద్ధిరాదు నీబోటివాళ్ళకి. వెళ్ళు యింక. ఆ డబ్బు యీ కవర్లో పెట్టు." అంటూంటే ఆ పిల్ల తన బాక్సు టీచరుకి అందించింది. ఆ బాక్సు తెరిచి, అందులోని మూడు పది రూపాయల నోట్లను సూర్యకాంతమ్మ తీస్తుంటే, ఏ జైలునో చూసినట్లుంది ఆ పిల్లపని.

"నీ వంటిదే కదా ఆ పిల్ల పాపం! ఎంత కష్టపడి సంపాదించారో వాళ్ళ నాన్నగారు యీ డబ్బు? పుస్తకాలు కొందామని తెచ్చుకుంటే, నువ్వు కాజేశావు. ఇవి దొరకకపోతే వాళ్ళమ్మా నాన్న ఎంత కొట్టేవారో ఆ పిల్లని. అవన్నీ ఆలోచించావా?" కరడు గట్టినట్లు యింతసేపు నిలబడ్డ ఆ

అమ్మాయి యీ మాటలకు నీళ్ళు కారింది. వేడి సోకిన మంచుగడ్డలా కరగ సాగింది. రెండు చేతులూ, పరికిణీ, జాకెట్టూ చాలలేదు కళ్ళు తుడుచుకోవడానికి.

"వెళ్ళింక క్లాసులోకి. రేప్రొద్దున్న స్కూలుకి టైముకి వచ్చేయి." అని చెప్పింది సూర్యకాంతమ్మ అధికార యుతంగా.

ఇంక యీవేళ సూర్యకాంతమ్మ మధ్యాహ్నం పెంద రాళే వెళ్ళవలసిన రోజున మరో కేసు. శ్రీలత అనే ఒక సంపన్నుల పిల్ల వేసుకొచ్చిన బంగారు గొలుసు ఎక్కడో పడి పోయిన సంగతి నలుగురి నోళ్ళలోనూ పడింది. ఆమెకారు లోనే పడిందో, మంచినీళ్ళ పంపు దగ్గర పడిందో, క్లాసులో బెంచీల మధ్యనే పడిందో మరి.

"శ్రీలతా! బంగారువస్తువులు వేసుకుని రాకూడదని రూలున్నది తెలియదా? "

"తెలుసును టీచర్! ఈవేళ శుక్రవారం కదా అని వేసుకువచ్చాను."

"సాయంత్రం యింట్లో వుండగా వేసుకోవచ్చునుగదా నగలన్నీ? ఇక్కడ స్కూల్లో నీ గొప్ప చూపించాలని ఎందు కనుకున్నావు!" అన్నది సూర్యకాంతమ్మ. శ్రీలత జవాబివ్వక ఎటో చూస్తోంది.

"చెప్పవేం!" అన్నాక యిటు తిరిగింది. కళ్ళు తడిగా మెరుస్తున్నాయి. చూపు నిలవక చెదిరిపోతోంది. "గొప్ప చూపాలని కాదండీ. సరదాకి..."

"నీ సరదా కాస్తా యిప్పుడేమైంది. రూలు పాటించనందుకు నష్టపోతున్నావు. అంతేకాదు. ఆ సొమ్ము ఎవరు తీశారోనని స్కూలులోని అన్నివందల మందీ మీద ఒక అనుమానం పుట్టింది. నౌకర్లమీద నిఘా వేయవలసి వస్తోంది. ఇదంతా అనవసరం గొడవ కదా!" అన్నది సూర్యకాంతమ్మ ఆవేశంగా. కొంచెం ఆగి. "నువ్వు క్లాసులీడరువి కనుక, అందరికీ ఆదర్శంగా వుండవలసిన దానివి. నీకు డబ్బున్నా కానీ, నలుగురి ముందూ డాబుగా ప్రదర్శించుకోవలసిన అవసరం ఏమీ లేదు. ఇప్పుడేమయింది- విలువైన సొమ్ము పోయింది." అన్నది.

శ్రీలత ఒకసారి టీచరువంక చూసి, మళ్ళీ కళ్ళు త్రిప్పి కిటికీలోంచి బయటకు చూడసాగింది. ఆ చూపులో వెయ్యిన్నర రూపాయల సొమ్ము పోయిందన్న బాధ లేదు. నా సొమ్మే కదా పోయింది. మీ కేమి అన్న బెదిరింపు కనపడింది. టీచరు వయస్సు, అనుభవం, అధికారం అన్నిటినీ ఎదిరిస్తోంది ఆ సంపన్నులబిడ్డ. "సరే వెళ్ళిక, తర్వాత చూద్దాం" అంటూ పంపివేసింది ఆ పిల్లని.

రోజంతా చీకాకుగానే వుంది యీసంఘటనతో సూర్యకాంతమ్మకి. మూడు కొడ్తోంటే హాస్పిటల్‌కి వెడదామని బయలుదేరింది. ఊడిపోయే జుట్టుని సరిగా చుట్టుకుని, బాత్ రూము వేపు వెళ్ళింది సూర్యకాంతమ్మ.

తిరిగి వస్తుంటే, మంచినీళ్ళ పంపు దగ్గర చిన్న కాలువ, మట్టితో నిండిపోయి కనబడింది ఆమెకి. నీళ్ళు అరటి చెట్ల

లోకి పోతాయి. ఆ కాలువలు ఎప్పుడూ సరిగా వుండవు. ఆలస్యమైపోయిందని విసుక్కుంటూనే కాలితో కాలువ మట్టిని సవరిస్తూ నాలుగడుగులు వేసింది సూర్యకాంతమ్మ. ఈ తోటలంతా ఆమె కృషి ఫలితమే. నాలుగడుగులు వేసేటప్పటికి—ఏమిటది కాలువ నీళ్ళల్లో మెరుస్తూ!—గొలుసు వంగి చేత్తో తీసుకుని పంపు దగ్గరకు వచ్చింది. స్కూలుటైమేమో, అంతా నిర్జనం దాన్ని కడిగేసి గుప్పెట్లో వుంచుకుని, గబగబ రూము దగ్గరికి వచ్చేసింది.

శ్రీలత గొలుసు ఇక్కడ పడింది. మొక్కల అవతలున్న నేరేడు చెట్టు దగ్గరికి కాయలకు వెళ్ళి వుంటుంది ప్రొద్దున్న. అయ్యో బంగారం పోయిందని తనకైనా ప్రాణం వుసూరుమనిపించింది కానీ ఆ అమ్మాయికి పికరే వున్నట్లు లేదు. శ్రీమంతులు వాళ్ళు. బిల్డింగు ఫండుకి క్రిందటేడాది పదివేల రూపాయలు యిచ్చాడు వాళ్ళ నాన్న. కారులో వచ్చి, పోతుంటుంది.

రూములోనూ ఎవరూ లేరు. బెల్లు కొట్టే ఆయా మాత్రం వరండాలో కునుకుతోంది. డ్రాయరు సొరుగుతీసి, పర్సుతీసుకుని అందులో గొలుసుని పడేసింది సూర్యకాంతమ్మ. హెడ్ మిస్ట్రెస్ గారితో వెడుతున్నానని చెప్పి, ఈ గొలుసు జాగ్రత్త చేయమని యిద్దామని వెళ్ళింది తీరా ఆమె రూములో లేదు. లేబరేటరీలో ఏవో వస్తువులు తనిఖీ చేయడానికి వెళ్ళారుట.

హాస్పిటల్‌కి వెళ్ళే హడావిడిలో వుందేమో, సూర్య కాంతమ్మ గబగబ గేటు దగ్గరికి వెళ్ళిపోయింది. బస్సుదగ్గర నిలబడితే ఆలస్యం అయిపోతుందని రిక్షాని పిలుచుకుంది.

దేవుని దయవల్ల ఆయనకి పూర్తిగా కులాసా చిక్కి సెలవు పొడిగించకుండా వెళ్ళిపోతే ఏ బాధా వుండదు. 'నాకీ రోగం రావడం కాదు గానీ కొంప ఆరిపోతోంది. బ్రతికి ఏం చేయాలి? ఒకే సారి కన్ను మూస్తే సరిపోదూ?' అని ఆయన అంటూంటే, ధయిర్యం చెప్పడం చేతకావడం లేదు తనకి. 'పెద్దదాని పెళ్ళికి అయిన అప్పులు యిప్పటికి తీర్చలేదు. ఇంకా దానికి పెడతానన్న బంగారం గురించి పేచీ గాలివాన అయిపోతోంది, దాని బ్రతుకుల్లో. సుడిగుండంలా ఎప్పుడో ఈ పరిస్థితులన్నీ కలిసి మనని ముంచేస్తాయి.' అంటూ ఒకటే గొడవ సాంబశివరావు హాస్పిటల్ బెడ్ మీద పడుకుని. ఆయనతో గంటలకొద్దీ ఏదో ఒకటి మాట్లాడుతూ. కాలక్షేపం చేయడం తనకు చేతనౌతుంది. అందుకే స్కూలు దోవ స్కూలుదిగా వదిలేసి, బయలుదేరింది ముందుగా యీ వేళ.

ఇవన్నీ సరే—కలలు కనడం మర్చిపోయిన కళ్ళతో తనవంక చూస్తున్న వసుమతి సంగతేమిటి? అమ్మా, నాన్నా నా బ్రతుకంతా ముందే వుందర్రా, ఏం చేస్తారు? ఈ వయస్సునీ, విద్యనీ వీటిని ఎవరిపరం చేయమంటారు. శక్తినీ, సెలయేటి లాంటి గలగల లాడే చైతన్యాన్ని ఏం చేస్తారు—అంటూ ప్రశ్నావళిలా వంపుగా వున్న కనుబొమలతో చూస్తుంది ఆ బిడ్డ.

అన్నిటిని గురించీ బాధపడడానికి వ్యవధి ఏదీ! హాస్పిటల్ గేటు చేరింది రిక్షా. పర్సులోంచి డబ్బు తీస్తుంటే, శ్రీలత పారేసుకున్న—కాదు సూర్యకాంతమ్మకి దొరికిన... బంగారు గొలుసు చేతికి తగిలింది.

అనుకున్నట్టుగానే మర్నాడే డిశ్చార్జి చేశారు సాంబ శివరావుని. అంచేత ఆ రోజు స్కూలుకి సెలవు పెట్టింది. గొలుసు తనదగ్గరే వుండి పోయింది. పంపడానికి వీలైన వస్తువు కాదాయె.

ఎల్లాగో డబ్బు సమకూర్చి, భర్తని యింటికి తీసుకు వచ్చాననిపించింది సూర్యకాంతమ్మ. మధ్యాహ్నం యింట్లో అందరూ తిని, కాస్త విశ్రాంతిగా వుండేటప్పటికి రెండు గంట లైంది. సాంబశివరావుకి కాస్త కునుకుపట్టింది. అబ్బాయి బయటికి వెళ్ళాడు. వాడు ఎప్పుడూ అంతే. వసుమతి ఏదో చదువుకుంటోంది వీధి గదిలో. సూర్యకాంతమ్మకే శరీరం ఎంత అలిసినా, మనస్సు కుదుటపడక, నిద్రపట్టడంలేదు.

పోస్టుమేన్ కేక వినిపించింది. ఉత్తరం వసుమతి అందు కున్నట్లుంది. కానీ ఎంత సేపటికీ, అది పుచ్చుకుని లోపలికి వచ్చి చూపించదే!

"అమ్మాయీ! ఎక్కడ నుంచమ్మా వుత్తరం?" అని కేక వేసింది ఆమె. బదులు రాకపోతే తనే మూలుగుతూ వెళ్ళింది. దాని వళ్ళోపడున్న ఇన్లాండ్ లెటరు చూస్తూనే అర్థమైంది పెద్దమ్మాయి దగ్గర్నుంచని. తల్లి తీసుకుపోతోంటే-

వసుమతి విసుగ్గా, "అబ్బా వుంచవే! ఎప్పుడూ వుండే విష యాలే!" అన్నది.

కానీ తల్లి ప్రాణం వూరుకుంటుందా? తీసుకుని చదివింది. అత్తగారు బంగారం గురించి మహా ఆరళ్లు పెడుతోంది.

'ఓసారొచ్చి నన్ను తీసుకుని పోకూడదా అమ్మా! ఇంత నరకంలోంచి కొన్నాళ్ళయినా బయట పడతాను. అంటూ వ్రాసింది. సూర్యకాంతమ్మకి గుండెల్లోంచి పైకి తోసుకొచ్చింది దుఃఖం.

లోపలికొచ్చి కూర్చోగానే, ఎదురుగా హేండ్ బ్యాగు కనబడింది. శ్రీలత బంగారు గొలుసు అందులో వుంది. నాలుగు సవరన్లుండవచ్చు. సూర్యకాంతమ్మ మనస్సులోని బాధ క్షణం సేపు స్తంభించి పోయింది. ఆ గొలుసు తనకి దొరికినట్లు ఎవరికీ తెలియదు. గొలుసు పారేసుకున్న శ్రీలత లక్షాధికార్ల బిడ్డ. అటువంటివి పది చేయించగలరు. ఆ పిల్లకైతే అసలు చీమ కుట్టినట్లులేదు.

తనకి దొరికింది అంతేకదా! అది దొంగతనం ఎల్లా ఔతుంది? అంతమంది పిల్లలూ, స్టాఫ్‌లో తనకే దొరికిందంటే, భగవంతుడే తన కళ్ళముందు పడేశాడు. నీ సమస్యలు అన్నీ కాకపోయినా కొన్నయినా పరిష్కరించుకోమని పడేశాడు.

ముందు పెద్దమ్మాయి బ్రతుకులోని చిక్కులు విడిపోతాయి. లేదా, చిన్నమ్మాయి జీవిత సారధికోసం చేసే అన్వేషణలో దీపశిఖలా పనిచేస్తుంది బంగారం.

ఈ పిల్లే కదా ముప్ఫై రూపాయలు కొట్టేసింది అనే వుద్దేశ్యం తోనే, పరకాయించిచూస్తూ ఒక్క నిముషం నిలబడింది సూర్యకాంతమ్మ.

కానీ ఆ పిల్ల తదేకదీక్ష— తింటుంటే బొట్లు బొట్లుగా అనుభవానికి వస్తున్న ఆ మాధుర్యం—ఆమెకి స్ఫురించాయి. లోకంలో మరేపనీ తనకి అంతకంటే ప్రియమైనది కానట్లు అన్నీ మరచి తింటోంది. ఆ పది పైసల ఐస్‌క్రీముని వీటి కోసం, యిల్లాంటి చిరుతిళ్ళ కోసమేనా ఆమె దొంగతనానికి పాల్పడింది అనిపించింది. వీటిమీద కోరిక కళ్ళకి పొరలుగా క్రమ్మిపోతే, విచక్షణ లేక దొంగతనం చేసింది ఆ కోరిక. అటెంప్టేషన్ చంపుకోవడం పసిబిడ్డకు చేతకాలేదన్నమాట. అన్ని రూపాయలతో ఎన్నిఐస్‌ఫ్రూట్‌లూ, ఎన్ని మొక్క జొన్న కండెలూ కొనవచ్చునో అని వూగిసలాడిన మనస్సుని అదుపు చేసుకోలేకపోయింది. టెంప్టేషన్! మనస్సుని పట్టుకుని లాగి, బలంగాపీకి, త్రాళ్ళ కట్టివేసే ప్రలోభం! ఎక్కడైనా డిగ్రీలు తేడా- అంతే. ఎక్కడైనా వయస్సులు తేడా అంతే. ఎక్కడైనా వస్తువులు, వాటి విలువా తేడా అంతే. మరి అంతేగా.

ప్రలోభం అంటే ఏమిటి, బలహీనతకు లొంగడం అంటే ఏమిటి—ఇరవై ఆరేళ్ళ సర్వీసున్న ఉపాధ్యాయినికి ఇప్పుడర్థమైంది మొక్కలను వంచడంలో సిద్ధహస్తురాలని పించుకున్న ఆమెకి నిండుఅసెంబ్లీలో దొంగతనం చేసినందుకు

క్షమాపణలు చెప్పించి, అవమానించి చీల్చి చెండాడుతానన్న సూర్యకాంతమ్మకి టెంప్టేషన్ అనే మాటకు అర్థం బాగా తెలిసింది.

గబుక్కున గుటక మింగి, చూపు త్రిప్పుకుంది సూర్యకాంతమ్మ. సరాసరి హెడ్ మిస్ట్రెస్‌గారి రూములోకి వెళ్ళి, బ్యాగు తెరుస్తూ. "మొన్నా గన్నేరు మొక్కల దగ్గర, నీళ్ళల్లోను...." అంటూ ప్రారంభించింది.

**